890) పాడి

ప॥ మచ్చికతోనేలవయ్యా మదన సామ్రాజ్య లక్ష్మి। పచ్చి సింగారాల చేత బండారాలు నిండెను ॥

చ॥ కొమరెతురుమునను గొప్ప మేఘముదయించి। చెమటవాసన కురిసె చెక్కులవెంట।
అమర పులకలపైరులు అంతటాను చెలువొంది। ప్రమదాల వలపుల పంటలివె పండెను ॥

చ॥ మించుల చూపుల తీగె మెరుపులిట్టెమెరసి। అంచె గోరికల జళ్ళువె పట్టెను।
సంచితపు కుచముల జవ్వనరాసులమించె। పొంచి నవ్వుల యామని పొదిగొనెనిదిగో ॥

చ॥ అలమేలుమంగమోవి అమృతము కారుకమ్మి। నలువంక మోహనపు సోనలు ముంచెను।
యెలమి శ్రీవేంకటేశ యింతినిట్టె గూడితివి। కొలది మీరి రతుల కొటార్లు గూడెను ॥